www.samasamajam.in


# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

29 డిసెంబర్, 2022 గురువారము - పుష్యము శుక్లపక్షం సప్తమి ( 7:17 సా॥ వరకు) అష్టమి | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-222 | పేజీలు - 4 | వెల రూ. 5/- | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


2వ

# భద్రాద్రి, రామప్పలను సందర్శించిన ముర్ము

## చిన్న పిల్లలే మన దేశ భవిష్యత్తు



- 30న యాదాద్రికి రాష్ట్రపతి ముర్ము
- రామయ్యను దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు
- ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనం
- రాష్ట్రపతి వెంట మంత్రులు, అధికారులు



ఏకలవ్య గురుకుల పాఠశాలను ప్రారంభించిన రాష్ట్రపతి

**భద్రాచలం, డిసెంబర్ 28 (సమ సమాజం):** చిన్న పిల్లలే మన దేశ భవిష్యత్తు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం భద్రాచలంలో వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ పూజారుల సమ్మేళనానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆన్ లైన్ ద్వారా ఏకలవ్య మోడల్ గురుకులాలను ప్రారంభించారు. అందరికీ నమస్కారం అని తెలుగులో చెప్పి రాష్ట్రపతి ప్రసంగం మొదలుపెట్టారు. ప్రముఖ కవి దాశరథి కలం నుంచి జాలువారిన 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న మాటలను పలికిన రాష్ట్రపతి... అటువంటి గడ్డపై రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా పర్యటిస్తున్నానని తెలిపారు. త్వరలోనే తెలుగు నేర్చుకుంటానన్నారు. ఆధ్యాత్మిక

3వ

## పద్మశ్రీ గ్రహీత శ్రీభాష్యం విజయసారథి కన్నుమూత

### సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు



**కరీంనగర్, డిసెంబర్ 28 (సమ సమాజం):** కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవి పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీభాష్యం విజయసారథి బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన నెల రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురై స్వగృహంలో మృతి చెందారు. ఇరుకుల్ల గ్రామ సమీపంలోని పద్మనాయక శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు జరిగాయి. సంస్కృతంలో అనేక కావ్యాలు రచించిన విజయసారథి అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. 2021లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. సంస్కృతంలో దక్షిణ భారత దేశం నుంచి ఈ అత్యున్నత అవార్డును అందుకున్న ఏకైక కవి విజయసారథి మాత్రమే. ముఖ్యమంత్రి కేసీఆర్ పై రచించిన చంద్రశేఖర ప్రశస్తిః ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. 1936 మార్చి 10 న కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామంలో గోపమాంబ,

3వ

# కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన మల్లికార్జు ఖర్గే

### ఆవిర్భావ కార్యక్రమానికి హాజరైన సోనియా,రాహుల్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 28 (సమ సమాజం):** భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పార్టీ ఆఫీస్ బేరర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాటం, సేవ, త్యాగం, అనే నినాదంతో 137 ఏళ్ల క్రితం ప్రారంభమైన కాంగ్రెస్

3వ





# అమెరికాను వదలని మంచు

### గడ్డకట్టుకు పోయిన నయాగరా జలపాతం



**న్యూయార్క్, డిసెంబర్ 28 (సమ సమాజం):** అమెరికాను మంచు తుఫాను వణికిస్తోంది. మైనస్ డిగ్రీల చలికి మంచినీరు కూడా గడ్డ కట్టుకుపోతోంది. మంచు తుఫాను ధాటికి.. గల గల పారే నయాగరా జలపాతం కూడా మూగబోయింది. జల సవ్వడులు లేక గడ్డకట్టుకుపోయింది. అందమైన నయాగారా ప్రస్తుతం మంచు దిబ్బలను తలపిస్తోంది.

3వ




## మునుగోడు నియోజకవర్గ బీసీ మేధావులు, నాయకులు, నిరుద్యోగులారా కదలిరాండి !



**మునుగోడు, డిసెంబర్ 28 (సమ సమాజం):** దేశంలో 55% ఉన్న బీసీలకు కేవలం రాజకీయాలకు పని చేసే కూలీలుగా తప్ప, రాజ్యాధికారం సాధించలేకపోయాము. ఏ ప్రభుత్వం కూడా మన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవసరాలను గుర్తించక పోగా, మన ప్రజలకు తాయిలాలు ఇచ్చి, మన సంఘాలను విచ్ఛిన్నం చేసి, మన ఐక్యతను దెబ్బ తీసి ఆగ్రకుల నాయకులు వారి పబ్బం గడుపుకుంటున్నారు.బీసీల కులగణనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు. ఈ బీసీల సామాజిక సమస్యనే భారతదేశ సమస్యగా భావించి, బహుజన సమాజ్ పార్టీ, తెలంగాణ శాఖ అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయటం కోసం గ్రామ స్థాయి నుండి బీసీల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటం జరుగు తుందని బీఎస్పీ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ అందోజు శంకరాచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజక వర్గ కేంద్రంలో ఈ నెల 30 శుక్రవారం మ.2:00 గం.లకు సత్య ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకుంటున్నామని ప్రకటనలో తెలిపారు.




# రాష్ట్ర డిజిపి ఎంపికపై ఉత్కంఠ

### ఐదుగురు సీనియర్లతో జాబితా పంపిన ప్రభుత్వం



**హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర కొత్త డీజీపీఎవరన్నది ఉత్కంఠగా మారింది. డీజీపీ రేసులో ఐదుగురు సీనియర్ అధికారులు ఉన్నారు. పోలీస్ బాస్‌గా ఎవరు వస్తారన్నది సిబ్బందిలో ఆసక్తికర చర్చగా మారింది. ప్రస్తుత డీజీపీ మహేందర్ రెడ్డి పదవీ కాలం ఈ నెల 31తో ముగుస్తుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. దీంతో డీజీపీ నియామకంపై ఉత్కంఠత నెలకొంది. సీనియారిటీ

3వ

## సంపాదకీయం

# సరిహద్దు సమస్యపై విమర్శలు తగవు !

చైనా సరిహద్దుల్లో మన బలగాలు నిరంతరాయంగా అప్రమత్తంగానే ఉంటూ శత్రు సైన్యంతో పోరాడుతు న్నాయి. పాక్ సరిహద్దుల్లో కూడా బలంగానే ఉన్నాయి. నెహ్రూ హయాం నాటి తప్పిదాలు జరగడం లేదు. సైనిక పాటవం పెరిగింది. రక్షణ రంగంలో మనం చైనాను ఢీకొనేందుకు ఎప్పుడూ వెనకాడడం లేదు. చైనా కూడా గతంలో లాగా మనముందు కాలుదువ్వడానికి సాహసించడం లేదు. అలాగే సైనికులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఆధునిక ఆయుధ సంపత్తిని అందిస్తోంది. ఒక్క ఇంచు జాగా కూడా పరాధీనం కాలేదని ఇటీవల పార్లమెంటులో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇచ్చారు. అయినా ఈ విషయంలో విపక్షాలు రచ్చ చేశాయి. సరిహద్దుల్లో మన భూభాగాన్ని చైనా ఆక్రమించిందన్న విమర్శలను కాంగ్రెస్ చేసింది. మొన్నటికి మొన్న మోడీపై పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలను దేశం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు సరిహద్దుల్లో జరుగుతున్న చర్యలపైనా సైన్యానికి మద్దతుగా, చైనా, పాక్‌లకు వ్యతిరేకంగానే మన సవాళ్లు ఉండాలి. అంతేగాని ప్రభుత్వాన్ని విమర్శించడం ద్వారా సైన్యాన్ని విమర్శించడమే అవుతుంది. ఓ వైపు భద్రతా బలగాలు, ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తా మని చెబుతూనే హస్తం పార్టీ అడపాదడపా తన అసలు రంగును బయటపెట్టుకుంటున్న తీరు సరికాదు. విమర్శలకు కూడా ఓ హద్దుండాలి.ఇది సైనిక బలగాల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేదిగా ఉంది. అధికారం లో ఉన్నా..విపక్షంలో ఉన్నా పార్టీలు జాతి ఐక్యత, సరిహద్దుల విషయంలో జాగ్రత్తగా మాట్లాడడం నేర్చు కోవాలి. రాజకీయాలు వేరు..దేశ భద్రత వేరని పార్టీలనేతలు గుర్తించాలి. ముంబై దాడులే కావచ్చు... పార్లమెంట్‌పై ఉగ్రదాడి కావచ్చు... వూరి నరమేధం కావచ్చు... పుల్వామా దాడి కావచ్చు.. సరిహద్దుల్లో దాడులు కావచ్చు..ఏ విషయంలో అయినా చైనా,పాక్‌లకు గట్టి బుద్ధి చెప్పేలా భారత్ బలగాలు ఎప్పటి కప్పుడు తిప్పికొడుతూనే ఉన్నాయి. మనలో విభేదాలను దీనిని అలుసుగా తీసుకుని పాక్ లేదా చైనాలు దూకుడుగా ప్రవర్తించే ప్రమాదాన్ని గుర్తించాలి. సరిహద్దుల్లో మన సైనికులు ఎందరో వారి జీవితాలను త్యాగంచేసి పోరాడుతున్నారు. ఒకవైపు చైనా మరోవైపు పాక్ కయ్యానికి కాలుదువ్వుతోంది. నిరంతరంగా వీరితో మన దళాలు పోరాడుతున్నాయి. ఈ క్రమంలో రాహుల్ గాంధీ పదేపదే దీనిని ప్రస్తావించడం, తెలంగాణ సిఎం కెసిఆర్ కూడా దీనిని రాజకీయం చేయాలని చూసారు. నిజానికి సర్జికల్ స్ట్రయిక్స్ జరిపాక సైన్యానికి స్వేచ్ఛను ఇచ్చారు. ఆ తరవాతనే సరిహద్దుల్లో ఇప్పుడు బారత్ గట్టిగా పోరాడగలుగుతోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతలో మన బలగాలు నిత్యం పోరాడుతున్నాయి. వారి జీవితాలను ఆత్మాహుతి చేస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో భారత్ వ్యతిరేక ప్రకటనలు పాక్ ప్రేరేపిత సంస్థల నుంచే వస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవలి చైనా సరిహద్దు ఘటనల ఆధారంగా ఇకపోతే విపక్ష పార్టీల ఆరోపణలు కేవలం రాజకీయం కాక మరోటి కాదు. ఇది చైనాకు కలసివచ్చే అంశంగా చూడాలి. ఇటీవల భారత్ వ్యతిరే కతకు పాల్పడుతున్న అనేక యూట్యూబ్ ఛానళ్లను కూడా నిషేధించిన విషయం ఇక్కడ గమనించాలి. సరిహద్దు విషయంలో సైన్యానిదే తుది నిర్ణయంగా ఉంటుంది. అక్కడ ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదు. దానిని ఆధారంగా చేసుకుని విపక్షాలు మాట్లాడాలి. లేకుంటే అది భారత వ్యతిరేక శక్తులకు ఆజ్యం పోసేదే తప్ప మరోటి కాదు. **947, 1965, 1971** నాటి యుద్ధాల్లో కూడా మన సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన విషయాన్ని మరువరాదు. వీరజవాన్ల త్యాగాలు వృథాగా పోవని మనమంతా ప్రతిన చేయాలి. ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండవచ్చు..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండ వచ్చు.. భద్రతపై రాజీపడ్డారని అనలేం. అలాగే మనమంతా ఒక్కటే అన్న సంకేతం ఇవ్వాలి. సర్జికల్

స్ట్రయిక్స్ జరిగాయా..జరిగితే రుజువేదని గతంలో కెసిఆర్ ప్రశ్నించడం ద్వారా దేశ బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారు. పుల్వామా ఉగ్రవాద దాడి తరవాత భారత సైన్యం దుందుడుకు, దుస్సాహస చర్యలకు దిగడానికి వెనకాడడం లేదు. సైనిక పరంగా జవాబివ్వాల్సిన చోట ఎక్కడా మన బలగాలు వెనక్కి తగ్గగడం లేదు. భారత సైన్యానికి ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. పుల్వామా ఉగ్రవాద దాడిలో పాకిస్తాన్ హస్తం లేదనీ, భారత్‌లోనే ఆ దాడికి కుట్ర పన్ని అమలు చేశారని పాక్ వాదించడం ద్వారా తప్పించుకునే ప్రయత్నాలుచేసింది. అలాగే సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత కూడా ఇలాంటి బుకాయింపులే పాక్ నుంచి వచ్చాయి. కానీ అభినవ్ బింద్రా పట్టుబడ్డ తీరు తరవాతి పరిణామాలు మనకు తెలిసిందే. పుల్వామా ఘటన తరవాత దేశమంతటా అసువులు కోల్పోయిన జవాన్లకు సానుభూతి వెల్లువ మాత్రమే కాదు, కశ్మీర్‌లో ఉగ్రవాదుల పట్ల, వారిని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ పట్ల తీవ్ర వ్యతిరేకత కూడా పెల్లుబికింది. ఆక్రమిత కశ్మీర్‌పై భారత సైన్యం దాడి చేస్తుందని, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేస్తుందని, మసూద్ అజర్ లాంటి ఉగ్రవాదులను హతమారుస్తుందని రకరకాల అంచనాలు ప్రచారం అయ్యాయి. అయితే అంతర్జాతీయంగా ఉన్న ఒత్తిళ్లను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. సీమాంతర ఉగ్రవాదాన్ని అనేక సందర్భాల్లో విమర్శించి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అసమర్థ వ్యాఖ్యలు చేయడం సరికాదు. పుల్వామా, కార్గిల్ రెండూ పాకిస్థాన్ ప్రేరేపిత ఘటనలే అన్నది ముమ్మాటికి నిజం. **2014**లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నరేంద్రమోదీ కశ్మీర్ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు అక్కడ ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడేందుకు, మానవీయ విలువలు ఏర్పడేందుకు, కశ్మీరీలను మనలో కలుపుకునేందుకు దోహదం చేసాయి. **370** ఆర్టికల్ రద్దు తరవాత పెద్ద విజయాన్ని సాధించాం. అక్కడ తన్ని తరిమివేయబడ్డ కాశ్మీర్ పండిట్లకు ఆదరణ దక్కింది. వారిలో ధైర్యం వచ్చింది. ఉగ్రవాద చర్యలను అరికట్టే కార్యక్రమాలు ముమ్మరం అయ్యాయి. ఈ క్రమంలో దేశభద్రతా చర్యల విషయంలో మనమంతా సంయమనంతో విమర్శలు చేయాలి. మన ప్రకటనలు పాక్‌కు,చైనాకు ఉప్పందించేలా ఉండరాదు. రాజకీయపార్టీలు దీనిని గుర్తెరిగి మసులకుంటే మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ప్రధాని మోడీ తల్లి హీరాబెన్‌కు అస్వస్థత

### హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు



**అహ్మదాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ మోదీ అనారోగ్యానికి గురయ్యారు. ఆమెను హుటాహుటిన అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హీరాబెన్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి ఆరోగ్య వార్త తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్ వెళ్లే అవకాశముంది. ఈ నేపథ్యంలో గుజరాత్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరవ్యాప్తంగా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. హీరాబెన్ వయస్సు ప్రస్తుతం 100 ఏండ్లు. ప్రస్తుతం ఆమె గాంధీనగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ తమ్ముడు పంకజ్‌భాయ్‌తో కలిసి బృందావన్ బంగ్లాస్-2, రైసన్, గాంధీనగర్‌లో నివసిస్తున్నారు. అయితే ప్రస్తుతం హీరాబెన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు హెల్త్ బులిటెన్ రిలీజ్ చేశారు. హీరాబెన్ మోడీ ఈ ఏడాది జూన్ లో 99వ సంవత్సరంలో అడుగుపెట్టారు. గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యేలు దర్శనాబెన్ వాఘోలా, కౌశిక్ జైన్ లు హుటాహుటిన హాస్పిటల్ కు చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఇటీవలే తల్లి హీరా బెన్ ను కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుజరాత్ వెళ్లిన ఆయన తల్లిని కలిశారు. ఆమెతో కలిసి టీ తాగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇటీవలే మోడీ సోదరుడు, కుటుంబ సభ్యులు కర్నాటక మైసూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు.

# దివ్యాంగ రచయిత్రి బూర రాజేశ్వరి మృతి



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 28 (సమ సమాజం):** రాజన్న సిరిసిల్లకు చెందిన దివ్యాంగ రచయిత్రి బూర రాజేశ్వరి (43) బుధవారం కన్నుమూసింది. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని నివాసంలో తుదిశ్వాస విడిచింది. రాజేశ్వరి కాళ్లతో ఎన్నో కవితలు రాసి పురస్కారాలను అందుకున్నది. సామాజిక, వర్తమాన అంశాలపై 350 వరకు కవితలు రాసింది. రాజేశ్వరి కవితలను సుద్దాల ఫౌండేషన్ పుస్తకం రూపంలోకి తీసుకురాగా.. ఈ బుక్‌ను రవీంద్రభారతిలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత దివంగత సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) ఆవిష్కరించారు. రాజేశ్వరి జీవితాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశంగా చేర్చింది. రాజేశ్వరి మృతికి మానేరు రచయితల సంఘం సంతాపం ప్రకటించింది.

# ఫామ్‌హౌస్ కేసులో ఇంతకు దోషులెవరో ?




- బిజెపి, బిఆర్ఎస్ పార్టీల తీరు బాధితులుగా చిత్రీకరణ
- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల చేరిక నుంచే విచారణ సాగాలి
- ఈ విషయంలో త్వరలోనే సిబిఐకి ఫిర్యాదు
- మీడియాతో చిట్‌చాట్‌లో పిసిసి చీఫ్ రేంవత్
- గాంధీభవన్‌లో ఘనంగా కాంగ్రెస్ అవిర్భావ దినోత్సవం

**హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** ఫాంహౌస్ కేసు విచారణ సరైన పద్దతిలో జరగడం లేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కేసులో బీఆర్ఎస్, బీజేపీలు పార్టీలు రెండు బాధితులే అయినప్పుడు దోషి ఎవరని ప్రశ్నించారు. ఫాం హౌస్ కేసులో కాంగ్రెస్ ఇంప్లీడ్ పిటిషన్ వేయాలా వద్దా అన్న అంశంపై చర్చ జరుగుతోందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ కేసులో నలుగురిలో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ మారిన వారేనని అన్నారు. పార్టీ మారిన వారికి బీఆర్ఎస్‌లో మంచి పదవులు ఇచ్చారని.. అది కూడా అవినీతి కిందకే వస్తుందని అన్నారు. 2018 నుంచి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై విచారణ జరపాలని రేవంత్ డిమాండ్ చేశారు.ఈ అంశంపై త్వరలోనే సీబీఐకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా ఫాం హౌస్ కేసుపై అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. నేరం జరిగిందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తామే విచారణ జరుపుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరోవైపు నేరమే జరగలేదంటున్న బీజేపీ సీబీఐ విచారణ కోరడాన్ని రేవంత్ తప్పుబట్టారు. సిట్ విచారణకు బీజేపీ, సీబీఐ విచారణకు బీఆర్ఎస్ ఎందుకు భయపడుతున్నాయని ప్రశ్నించారు. పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసును రెండు కోణాల్లో చూడాలని రేవంత్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్, బీజేపీ రెండు బాధితులుగా చూపిస్తున్నారని.. మరి ఇందులో దోషి ఎవరు అని ప్రశ్నించారు. విచారణ ఒకరిని బాధితుని కింద.. మరొకరిని నేరగాని కింద జరుగుతుందన్నారు. నేరం జరిగింది.. కానీ విచారణ తామే చేస్తాం అనడం ద్వారా టీఆర్ఎస్ లోపం బయటపడిందని వ్యాఖ్యలు చేశారు. నేరమే జరగలేదని అంటూనే సీబీఐ విచారణ అడగడం ద్వారా బీజేపీ లోపం బయటపడుతుందని తెలిపారు. సీబీఐ విచారణ అనగానే బీజేపీ, సిట్ విచారణ అనగానే టీఆర్ఎస్ ఎందుకు సంకలు గుద్దుకుంటున్నాయని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కొనుగోలు కేసులో కాంగ్రెస్ ఇంప్లీడ్ పీటీషన్ వేయాలా వద్దా అనే దానిపై చర్చ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నలుగురిలో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ మారిన వారని తెలిపారు. పార్టీ మారిన వారికి టీఆర్ఎస్‌లో మంచి పదవులు ఇచ్చారని.. ఇది కూడా కరప్షన్ కిందే వస్తుందన్నారు. అందుకే కొనుగోలు కేసు.. ఇన్ కంప్లీట్ కేసు అని చెప్పుకొచ్చారు. కాబట్టి 2018 నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల దగ్గర నుంచి విచారణ జరగాలని సీబీఐకి ఫిర్యాదు చేయనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆత్మనే సిద్ధాంతంగా రచించుకొని ఆచరిస్తున్న పార్టీ ఏదైన ఉంటే అది కాంగ్రెస్ పార్టీయే అని తెలిపారు. మహాత్మగాంధీ ఇచ్చిన స్ఫూర్తిని కాంగ్రెస్ శ్రేణులు కొనసాగిస్తారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ పాలనలో సమూలమార్పులు తీసుకొచ్చారని, మహిళా రిజర్వేషన్ బిల్లును నాడు బిజెపి అడ్డుకుందని చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఉందంటే అది కాంగ్రెస్ నిర్ణయమే అని వివరించారు. దేశ ప్రజలపై బ్రిటిష్ విధానాలను రుద్దాలని బిజెపి ప్రయత్నిస్తుందని, రాహుల్ పాదయాత్ర భయంతోనే మోడీ కోవిడ్ రూల్స్ తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటి పై కేంద్రాన్ని కెసిఆర్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. జనవరి 26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రకు కదలిరావాలని, వ్యక్తిగత సమస్యలపై కాకుండా ప్రజా సమస్యల పై పోరాడేందుకు పార్టీ శ్రేణులు ముందుకు రావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ అంజన్ కుమార్ యాదవ్, మహేష్ కుమార్ గౌడ్, మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, బలరాం నాయక్, సంభాని చంద్రశేఖర్, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణు గోపాల్, సేవాదల్ చీఫ్ ప్రసాద్, గడ్డం వినోద్, రామచంద్రారెడ్డి, వినోద్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సంగిశెట్టి జగదీష్, రోహిన్ రెడ్డి, సమీర్ ఉల్లా, అనుబంధ సంఘాల ఛైర్మన్‌లు మెట్టు సాయి, నూతి శ్రీకాంత్, సునీతా రావ్ తదితరులు హాజరయ్యారు.

# పోడురైతుల సమస్యలపై పోరాటం ఆగదు

### గిరిజనుల ఉపాధిని కాపాడాల్సిందే: సీతక్క



**ములుగు, డిసెంబర్ 28 (సమ సమాజం):** రాష్ట్రంలో పోడుభూముల సమస్య తీవ్రంగా ఉందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. అడవితల్లినే నమ్ముకుని జీవించే గిరిజనుల గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడుభూములకు పట్టాలు ఇచ్చి రెండు పంటలకు సరిపడా సాగునీటిని అందించాలన్నారు.అసెంబ్లీ సమావేశాల సమయంలో సీఎం కేసీఆర్ పోడుభూములకు పట్టాలు ఇస్తామని చెప్పి నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో వచ్చిన చట్టాన్ని అమలు చేయటంలో పాలకులు ఎనలేని నిర్లక్ష్యం చూపతున్నారన్నారు. పాత పోడుకు పట్టాలు వదలం.. కొత్త పోడు కొట్టం అనే నినాదంతో ముందుకు వెళతామన్నారు. పోడుభూములకు పట్టాలు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉవ్వెత్తున చేపడతామన్నారు. ఇకపోతే ఎప్పుడూ లేని విధంగా అడవులలో పులులను వదిలి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రెండేళ్లుగా అనేక హామీలు ఇచ్చిన పాలకులు అమలు చేయటంలో విఫలమయ్యారని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పులుల సంచారం గురించి చర్చ జరుగుతోందని, గతంలో ఎక్కడా లేని పులులు ఇపుడు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. కావాలనే పాలకులు అడవుల్లో పులులను వదిలి కట్టెలు, కాయలు, ఆహారం కోసం కూడా గిరిజనులు అడవుల్లోకి వెళ్లకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు.

# ఫార్మాసిటీని రద్దు చేయాలి

ఫార్మా కంపెనీలతో హైదరాబాద్‌కు కాలుష్యం ముప్పు

రైతుల భూములతో ప్రభుత్వం వ్యాపారం

రైతుల పాదయాత్రలో పాల్గొన్న కోమటిరెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** ప్రభుత్వం వెంటనే ఫార్మా సిటీని రద్దు చేయాలని భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్ల రూపాయలకు ఫార్మా కంపెనీలకు అమ్ముకుంటోందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసిన చోట కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఒకే చోట వందల కంపెనీలు ఏర్పాటు చేస్తే.. హైదరాబాద్ చుట్టుపక్కల ఎవరూ ఉండలేరని తెలిపారు. పార్టీలకతీతంగా పోరాటం చేయాలని సూచించారు. ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులు పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమం ఫార్మా సిటీ ప్రతిపాదిత గ్రామం మేడిపల్లి నుంచి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. మంగళవారం ప్రారంభమైన ఈ పాదయాత్ర బుధవారం ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఇక్కడ పాదయాత్ర ప్రారంభం కాగానే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులతో కలిసి కొంత దూరం ఆయన నడిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి సారవంతమైన భూములను లాక్కోవడం, రైతలను వీధుల పాటు చేయడం తగదన్నారు. ఫార్మాసిటీతో లాభం లేదన్నారు. రాష్ట్రంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇదిలావుంటే యాదాద్రి జిల్లా బీఎన్ తిమ్మాపురం భూనిర్వాసితుల ధర్నా కొనసాగుతోంది. ఇటీవలే కోమటిరెడ్డి వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నాను. సంబంధిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడాను. గ్రామస్తులకు అన్యాయం జరగకుండా చూడాలని చెప్పడం జరిగింది. భూనిర్వా సితులకు ధైర్యం చెప్పి పోరాటానికి మద్దతు తెలిపాను. స్వాపురం రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వాలని కోరుతూ బీఎన్ తిమ్మాపురం వాసులు పోరాటం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇండ్ల నష్టపరిహారం కూడా ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం ఇవ్వాలని కోమటిరెడ్డి అన్నారు.


## లోదుస్తుల్లో బంగారం

### శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత

**హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకువచ్చిన ఓ వ్యక్తిని శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దుబాయ్ నుండి వస్తున్న ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా.. పేస్ట్ రూపంలో ఉన్న గోల్డ్ బయటపడింది. లోదుస్తులు, ప్యాంటు, చొక్కాలో దాచిపెట్టిన బంగారాన్ని పేస్ట్ రూపంలో స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 704 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.39.66 లక్షలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలియజేశారు. సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొని అన్ని కోణాల్లో కస్టమ్స్ అధికారులు విచారణ చేపట్టారు.

# హైకోర్టులో రోహిత్ రెడ్డికి ఎదురుదెబ్బ

### ఇడి దర్యాప్తుపై స్టేకు నిరాకరణ




**హైదరాబాద్, డిసెంబర్ 28 (సమ సమాజం):** ఫాంహౌస్ కేసులో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ దర్యాప్తుపై స్టే ఇవ్వాలన్న రోహిత్ రెడ్డి అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. కేసు తదుపరి విచారణను 5వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం.. ఆ లోగా ఈడీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఫాం హౌస్ కేసుకు సంబంధించి ఈడీ, రోహిత్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. మంగళవారం విచారణకు రావాలని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి నోటీసులు ఇచ్చినా ఆయన గైర్హాజరయ్యారని ఈడీ కోర్టుకు తెలిపింది. దీంతో ఈ నెల 30న విచారణకు రావాలని మరోసారి నోటీసులు పంపినట్లు ఈడీ తరఫు న్యాయవాది ధర్మాసనానికి చెప్పారు. రోహిత్ రెడ్డి తరఫున వాదనలు వినిపించిన లాయర్ తన క్లయింటు రెండుసార్లు ఈడీ విచారణకు హాజరయ్యారని న్యాయమూర్తికి చెప్పింది. సమన్లలో ఈడీ అడిగిన అన్ని వివరాలు సమర్పించినట్లు చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఈడీకి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 5వ తేదీకి వాయిదా వేసింది.

## సర్పంచ్‌లు ఆత్మహత్యచేసుకునే పరిస్థితులు

తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబమే బాగుపడ్డది

అనుమలు కాంగ్రెస్ సమావేశంలో ఎంపి ఉత్తమ్

**నల్లగొండ, డిసెంబర్ 28 (సమ సమాజం):** టీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్ లు ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల ఫ్యామిలీ మాత్రమే బాగుపడిందని... ఈసారి తప్పనిసరిగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ , బీజేపీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. హాలియా లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో అనుముల మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి పాల్గొన్నారు. తాను ఎంపీగా ఉండి కూడా అధికారుల వల్ల ఇబ్బందులకు గురైనట్లు ఆరోపించారు. ఏ అధికారి ఇబ్బందులకు గురి చేసినా తనకు చెప్పాలని.. 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. నల్గొండ ఎంపీగా పార్లమెంట్ లో నియోజకవర్గ ప్రజల గొంతు వినిపించినట్లు తెలిపారు.టిఆర్ఎస్ ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ ఏమైందన్నారు. 4ఏళ్ళు కావస్తున్నా ఎందుకు చేయలేదని నిలదీశారు. ఏ దేశంలో లేని స్వేచ్ఛ మన దేశంలో ఉందన్న ఆయన... ప్రపంచ అగ్ర దేశాల్లో భారత దేశం 5వ స్థానంలో, సైన్యంలో 4వ స్థానంలో ఉందన్నారు. మహాత్మా గాంధీకి జవహర్ లాల్ నెహ్రులకు మనం వారసులమన్నారు. సత్యాగ్రహ మార్గం ద్వారా స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. 138 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పార్టీ కష్టాల్లో లేదన్నారు. సీనియర్ నాయకులు జానారెడ్డి ఏది చేపట్టినా... ఆయన అడుగుజాడల్లో నడుస్తానని.. వారికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర ముగింపు రోజున హాత్ సే హాత్ కలపండి అనే నినాదంతో ముందుకు పోదామని కార్యకర్తలకు సూచించారు.




నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా

## ఫిలిప్పీన్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

**మనీలా, డిసెంబర్ 28 (సమ సమాజం):** ఫిలిప్పీన్స్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 25కు పెరిగింది. ఇప్పటివరకు 9 మందికి గాయాలు కాగా, 26 మంది గల్లంతయ్యారు. దక్షిణ, తూర్పు ఫిలిప్పీన్స్ రెయిన్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంది. భారీ వర్షాలతో 1200 ఇండ్లు, 123 రోడ్లు, 12 బ్రిడ్జిలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఫిలిప్పీన్స్ లోని 63 ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సుమారు 4 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపాయి. వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. అంతేకాదు 15 పోర్టుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఒక్క బేబే నగరంలోనే 4 కొండచరియలు విరిగిపడటంతో 22 మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన మల్లికార్జు ఖర్గే



(మొదటి పేజీ తరువాయి) ప్రయాణం నిరంతరం కొనసాగుతోంది. కాంగ్రెస్ తన ఆశయాలు, లక్ష్యాలకు కట్టుబడి ఉందని మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడిన ఆయన మోడీ సర్కార్ తీరుపై మండిపడ్డారు. గంగా జమున సంస్కృతిని రూపుమాపే కుట్ర జరుగుతోందన్నారు. దేశంలో సాధారణ పౌరుడు అభద్రతా భావంలో ఉన్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పక్కదారి పట్టిస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ మౌనంగా ఉండబోదన్నారు. ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ప్రారంభమైన కాంగ్రెస్ పార్టీ ప్రయాణం.. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదర్శాలు, విలువలు, సూత్రాలకు.. మరోసారి తమల్ని తాము పునరంకితం చేసుకుంటామన్నారు.

# రాష్ట్ర డిజిపి ఎంపికపై ఉత్కంఠ



(మొదటి పేజీ తరువాయి) ప్రాతిపదికన ఐగుదుగురు ఉన్నతాధికారుల పేర్లతో జాబితా ఇప్పటికే యూపీఎస్సీ కి చేరింది. వారిలో ముగ్గురి పేర్లను సిఫారసు చేస్తూ రాష్ట్రానికి యూపీఎస్సీ సూచన చేయనుంది. అయితే డీజీపీ రేసులో 1990 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత ఏసీబీ డీజీ అంజనీ కుమార్ 1989దబ్యాచ్‌కు చెందిన హోంశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ రవిగుప్తా రేసులో ఉన్నారు. వారితో పాటు మరో ముగ్గురు ఐపీఎస్‌లు పోటీపడుతున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ , అడిషనల్ డీజీ జితేందర్ , రాజీవ్ రతన్ కూడా రేసులో ఉన్నారు. ఈ ఐదుగురిలో డీజీపీ పోస్టు ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## పాటిగడ్డలో 20 పడకల ఆస్పత్రికి కృషి



స్థానికులకు మంత్రి తలసాని హామీ

హైదరాబాద్,డిసెంబర్28(సమ సమాజం): నియోజకవర్గంలోని పాటిగడ్డలో 20 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కావలసిన నిధుల కోసం కృషి చేస్తానని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పాటిగడ్డలో నివాసముంటున్న పేదలు ఆస్పత్రికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన మంత్రికి విన్నవించారు. ముఖ్యంగా గర్భిణిలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, స్థానికంగా 20 బెడ్స్ ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆస్పత్రికి అవసరమైన ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్ ఆధ్వర్యంలో టీఎస్ ఎంఐడీసీ ఎస్‌ఈ సురేందర్ రెడ్డి, ఇతర అధికారులు మంత్రిని కలిసి నూతన ఆస్పత్రి భవనానికి సంబంధించిన నమూనాను మంత్రికి వివరించారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి కావలసిన రూ. 6 కోట్లు నిధులు మంజూరుకు మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడి మంజూరికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి చెప్పారు.

## అవయవ దానానికి ముందుకు రావాలి



అవగాహనా సదస్సులో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్28(సమ సమాజం): అవయవ దానానికి ప్రజలు ముందుకు రావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. బుధవారం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవన్‌దాన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉందని వెల్లడించారు. ఇప్పటి వరకు 1158 మంది వద్ద అవయవాలు సేకరించి 4057 మంది పునర్జన్మ ఇచ్చారని పేర్కొన్నారు . ప్రజల్లో అవగాహన పెంపొందించి అవయవ దానాన్ని ముందుకు వచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మరణించిన తరువాత మట్టిలో కలిసిపోవడం కంటే మరో ఇంటికి వెలుగునివ్వడం గొప్ప విషయమన్నారు. అవయవ దానంపై సామాజిక రుగ్మతలు , మూఢ నమ్మకాలను విశ్వసించ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి, జీవన్దాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ గ్రహీత శ్రీభాష్యం విజయసారథి కన్నుమూత



(మొదటి పేజీ తరువాయి) నరసింహాచార్య దంపతులకు జన్మించిన విజయసారథి సంస్కృత భాషలో కూలంకషమైన పాండిత్యంతోపాటు కవిత్వంలోనూ తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారు. ఆయన మృతికి జిల్లాకు చెందిన మంత్రి గంగుల కమలాకర్, ఇతర ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

## అమెరికాను వదలని మంచు



(మొదటి పేజీ తరువాయి) అమెరికా, కెనడాల మధ్య ఉన్న నయాగారా జలపాతం అందాలు వర్ణణాతీతం. నయాగరా జలపాతం అందాలు తనివి తీరనివి. అలాంటి అద్భుత జలపాతం మంచు తుఫాను ధాటికి గడ్డకట్టుకుపోయింది. అక్కడి వాతావరణ పరిస్థితుల కారణంగా నయాగారా జలకళ దిగాలుగా మారింది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవటంతో నయాగరా మంచు ముద్దగా మారింది.

# పంచాయితీ నిధులు పక్కదారి పట్టించిన ప్రభుత్వం

కేంద్రం విడుదుల చేసిన నిధులు మాయం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల ఆందోళన


వికారాబాద్,డిసెంబర్28(సమ సమాజం): పరిగి బస్టాండ్ ముందు కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన.. 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని వారు ఆరోపించారు. హైదరాబాద్– బీజాపూర్ హైవేపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేస్తూ తమ నిరసన కొనసాగించారు. నిరసన కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. గత కొన్ని నెలలుగా నిధుల లేమితో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్న సమయంలో.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సర్పంచుల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం పై పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల దుర్వినియోగం జరగవద్దనే ఉద్దేశంతో డిజిటల్ కీలు ఏర్పాటు చేసినప్పటికీ.. వాటిని సర్పంచులకు అప్పజెప్పకుండానే ఎంపీడీవోలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేరుగా గ్రామపంచాయతీ నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన పనులన్నీ నిధులు లేకున్నా అప్పులు చేసి పూర్తి చేసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం తమని వేధిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటితో తమ ఉద్యమం ఆగదని, గ్రామాల నుంచి ప్రజలను తీసుకొచ్చి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఆసిఫాబాద్ కు చెందిన 14 మంది సర్పంచులు రాజీనామా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని దుయ్యబట్టారు.

# జనవరి నాటికి కోవిడ్ విజృంభించే ఛాన్స్

అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

విదేశాల నుంచి వస్తున్న వారికి వైరస్

ఇప్పటికే 39మందికి పాజిటివ్‌గా గుర్తింపు



న్యూఢిల్లీ,డిసెంబర్28(సమ సమాజం): భారత్‌లో కరోనా డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ప్రస్తుతం దేశంలో ఎక్కడా పెద్దగా కొవిడ్ కేసులు నమోదు కానప్పటికీ.. వచ్చే జనవరి నెల మధ్య కాలం నాటికి కరోనా మహమ్మారి విజృంభించే అవకాశం ఉన్నది. కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించాయి. గతంలో కొవిడ్ విజృంభించిన తీరును బట్టి వచ్చే జనవరి మాసం మధ్యలో కేసులు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ అంచనా వేసినట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. చైనా, జపాన్, దక్షిణకొరియా లాంటి దేశాల్లో కరోనా విజృంభిస్తుండటంతో దేశంలో అదే పరిస్థితి వస్తే ఎదుర్కోవడానికి భారత్ సిద్ధమైంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పరిస్థితిని అదుపులో పెట్టేలా ఏర్పాట్లు చేశారు. ఇవాళ కూడా దుబాయ్ నుంచి తమిళనాడుకు వచ్చిన ఇద్దరిలో కరోనా మహమ్మారిని గుర్తించారు. చెన్నై ఎయిర్‌పోర్టులో వారి శాంపిల్స్ సేకరించి జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపించారు. ఈ రెండు కేసులతో కలిపి డిసెంబర్ 24 నుంచి 26 మధ్య దేశంలో కరోనా బారినపడిన అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 39కి చేరింది. మొత్తం 498 విమానాల నుంచి 1780 మంది శాంపిల్స్ సేకరించారు. అందులో 39 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 188 మంది కొవిడ్ బారినపడ్డారు. దాంతో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 3,468కి చేరింది. కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. చైనాలో కొవిడ్ కేసులు రోజు రోజుకీ పెరుగుతుండటంతో కేంద్రం అలర్ట్ అయింది. మహమ్మరి కట్టడికి చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మరిన్ని కీలక సూచనలతో పాటు, హెచ్చరికలనూ జారీ చేసింది. మాస్క్ లు తప్పనిసరిగా ధరించాలని, శానిటైజర్లు వాడాలని చెప్పింది. రానున్న 40 రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటిస్తూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని కేంద్రం ప్రకటించింది. చైనాతో పాటు దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లోనూ కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో కేంద్రం ఇటీవలే కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎయిర్ పోర్టుల్లో కరోనా పరీక్షలు తప్పనిసరి చేసింది. గత రెండు రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో కలిపి మొత్తం 6వేల మంది విదేశీ ప్రయాణికులకు టెస్టులు చేయగా.. అందులో 39మందికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయిందని ఆరోగ్యశాఖ తెలిపింది. అయితే దేశంలో గత 24 గంటల్లో 188 కొత్త కొవిడ్ కేసులు నమోదు కాగా.. ప్రస్తుతం రికవరీ రేటు 98.8శాతంగా ఉంది.

# భద్రాద్రి, రామప్పలను సందర్శించిన ముర్ము




(మొదటి పేజీ తరువాయి) పర్యాటకరంగం దేశంలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సమ్మక్క సారలమ్మ పూజరుల సమ్మేళనం సామాజిక సామరస్యానికి ప్రతీక అని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం వృద్ధి నొందుతుందని, అందుకు వానవాసి కళ్యాణ పరిషత్ కృషి అభినందనీయమన్నారు. ఒక్క ప్రభుత్వం వల్లే పూర్తీ స్థాయిలో సమాజ అభివృద్ధి సాధ్యంకాదని, ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పువ్వాడ అజయ్, సత్యవతి, ఎంపి కవిత, భద్రాద్రి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు... భద్రాద్రి రామయ్యను రాష్ట్రపతి ముర్ము దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో శ్రీసీతారామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద రాష్ట్రపతికి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'ప్రసాద్' పథకం శిలాఫకాన్ని ఆవిష్కరించారు. తర్వాత వర్చువల్ విధానంలో కొమరంభీం ఆసిఫాబాద్ , మహబూబాబాద్ జిల్లాల్లోని ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించారు. అనంతరం రామప్ప దేవాలయానికి చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం పలికారు. రుద్రేశ్వరుడిని దర్శించుకుని రాష్ట్రపతి పూజలు చేశారు. రాష్ట్రపతికి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందించారు. మేడారం సమ్మక్క సారలమ్మ సారేను మేడారం ఆదివాసీ పూజారులు రాష్ట్రపతి, గవర్నర్ లకు ఇచ్చారు. ఆలయ విశిష్టత, నిర్మాణం, యునెస్కో గుర్తింపుకు కోసం తయారు చేసిన డోసియర్ వివరాలు, వరల్డ్ హెరిటేజ్ బాడి విధించిన నిబంధనలు, తదితర అంశాలను రాష్ట్రపతికి కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ పాండురంగారావు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. రాష్ట్రపతితో పాటు పూజల్లో పాల్గొన్న వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్, రాష్ట్ర మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకరరావు, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు. భద్రాచలం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో రామప్ప ఆలయానికి రాష్ట్రపతి ముర్ము వచ్చారు. హెలిప్యాడ్ నుంచి బ్యాటరీ కారులో యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు ఆమె చేరుకున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా రామప్ప ఆలయాన్ని భద్రతా అధికారులు పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రామప్ప చుట్టుపక్కల కల్పించునున్న మౌలిక సదుపాయాల శిలాఫలకం, కామేశ్వరాలయ పునర్ నిర్మాణ శిలాఫలకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు. రామప్ప ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి కేందప్రభుత్వం 'ప్రసాద్' పథకంలో భాగం గా రూ.61.99 కోట్లను మంజూరు చేసింది. ఈ పథకంలో 4 డి మూవీ హాల్, కాకతీయ తోరణం ఆర్చీ, గా÷–డ్గ÷న్, ప్లేగ్రౌండ్, వాహనాల పార్కింగ్, హోటళ్లు, షాపింగ్ మాల్స్, రహదారుల విస్తరణ, లైటింగ్, సిట్టింగ్ బెంచీలు, సీసీ కెమెరాలు, సర్వేలైన్స్ సిస్టంలు ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సోలార్ విద్యుత్ పవర్‌ప్లాంట్, చెరువులో జెట్టి బోట్స్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. భద్రాద్రిలో...

## న్యూ ఇయర్ వేడుకలు లక్ష్యంగా డ్రగ్స్ సరఫరా

హాస్టలప్ దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్



హైదరాబాద్,డిసెంబర్28(సమ సమాజం): హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం సృష్టించింది. న్యూ ఇయర్ వేడుకలే టార్గెట్ గా చేసుకుని.. ఓ ముఠా నగరానికి మత్తు పదార్థాలు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తోంది. విజయవాడలో పట్టుబడ్డ ప్రధాన నిందితుడు హరి సతీష్ ఇచ్చిన సమాచారంతో నగరంలో సోదాలు చేశారు. బంజారాహిల్స్ లోని ఓ హాస్టల్ పై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ మెరుపు దాడులు చేసింది. 48 గ్రాముల ఓపిఎం, 25గ్రాముల కొకైన్ ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ కు డ్రగ్స్ తరలించినట్టు అధికారులు గుర్తించారు. యమన్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూఇయర్ వేడుకలు టార్గెట్‌గా హైదరాబాద్‌కు డ్రగ్స్ సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ ముఠా తరలిస్తున్నారు. గ్రాము డ్రగ్స్‌ను రూ.10 వేలకు ముఠా విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. పట్టుబడ్డ నిందితుడు యమనే నుంచి కీలక సమాచారాన్ని ఎక్సైజ్ అధికారులు రాబట్టారు. ఎవరెవరికి డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. ఎక్కడి నుంచి డ్రగ్స్ తెస్తున్నారు దీని వెనుక ఎవరున్నారు. అనే విషయాలపై కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలుస్తోంది. యమనేపై హైదరాబాద్ లో మూడు డ్రగ్స్ కేసులు పెండింగ్ లో ఉన్నట్లు గుర్తించారు. 11 మంది పాత డ్రగ్స్ వినియోగదారులు ఓ ఏజెంట్ నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేసినట్టు తెలిపారు.

## బడ్జెట్‌లో తెలంగాణ చేనేతకు నిధులు ఇవ్వాలి

చేనేతపై జిఎస్టీని పూర్తిగా ఎత్తేయాలి




హైదరాబాద్,డిసెంబర్28(సమ సమాజం): తెలంగాణ టెక్స్‌టైల్ రంగానికి ఊతమివ్వాలని రాష్ట్ర చేనేత, జౌళీశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించాలన్నారు. నేతన్నల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఇందుకు మద్దతు ఇవ్వాలని కోరినా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కొన్నేళ్లుగా తెలంగాణకు అందుతున్నది శూన్యమని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు, సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌కు నిధులు ఇవ్వాలన్నారు. టెక్స్‌టైల్, చేనేతరంగంపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలన్నారు. బ్లాక్ లెవల్ హ్యాండ్‌లూం క్లస్టర్ల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలన్నారు. టెక్స్‌టైల్, నేతన్నల పరిస్థితిపై కేంద్రానికి కనీస అవగాహన లేదని విమర్శించారు. నేతన్నల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నానన్నారు.

# 2036లోనే ఒలంపిక్ క్రీడల నిర్వహణకు ఛాన్స్

## భారత్ బిడ్ వేస్తుందన్న మంత్రి అనురాగ్ ఠాకూర్



న్యూఢిల్లీ,డిసెంబర్28(సమ సమాజం): ఒలింపిక్ క్రీడలు నిర్వహించినప్పుడల్లా మన దేశం బిడ్ దాఖలు చేయాలనే చర్చ తెరపైకి వస్తుంది. మన ఈ కోరిక తీరాలంటే మరో 14 ఏండ్లు ఎదురుచూడాల్సి వస్తుంది. ఎందుకంటే ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చే స్థాయిని భారత్ 2036 లో అందుకుంటుందని స్వయంగా మన కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ సిద్ధంగా ఉన్నదని టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దీన్ని సాధించేందుకు ఇండియన్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) కి రోడ్‌మ్యాప్ ఇస్తామని చెప్పారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) క్రీడల నిర్వహణకు ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలతో ఆతిథ్య నగరంగా మారుతుందని ఠాకూర్ చెప్పారు. గతంలో 1982 ఆసియా క్రీడలు, 2010 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇచ్చిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. జీ 20 ప్రెసిడెన్సీని భారత్ ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించగలిగినప్పుడు.. ఐఓఏతో కలిపి కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్స్ నిర్వహించగలదని భావిస్తున్నట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఒలింపిక్స్‌కు పూర్తిగా సిద్ధమైన తర్వాతనే భారత్ బిడ్ వేస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి గుజరాత్ రాష్ట్రం చాలాసార్లు ఆసక్తి చూపిందని, అక్కడ హోటళ్ళు, హాస్టల్స్, ఎయిర్‌పోర్ట్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి మౌలిక సదుపాయాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. గుజరాత్‌లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు సిద్ధమని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన మేనిఫెస్టోలో ప్రస్తావించింది.

# ఫీల్డర్‌ను ఢీకొన్న స్పైడర్ కామ్

## బలంగా తాకడంతో కిందపడ్డ దక్షిణాఫ్రికా బౌలర్ అన్రిచ్

## 8 వికెట్లకు 575 రన్స్ వద్ద ఆస్ట్రేలియా డిక్లేర్



మెల్‌బోర్న్,డిసెంబర్28(సమ సమాజం): ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న రెండవ టెస్టులో ఓ గమ్మత్తు ఘటన జరిగింది. రెండవ రోజు రెండో సెషనల్‌లో.. మైదానంలో ఉన్న స్పైడర్‌క్యామ్.. దక్షిణాఫ్రికా బౌలర్ అన్రిచ్ నోర్జాను ఢీకొట్టింది. సౌతాఫ్రికా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. వైర్లకు వేలాడే స్పైడర్‌క్యామ్‌లు.. మ్యాచ్ టైమ్‌లో అటూ ఇటూ కదిలే విషయం తెలిసిందే. అయితే నోర్జా ఫీల్డింగ్ కోసం వెళ్తున్న సమయంలో.. వెనుక నుంచి వచ్చిన స్పైడర్‌క్యామ్ అతన్ని ఢీకొట్టింది. దీంతో నోర్జా కిందపడిపోయాడు. అతని భుజానికి, మోచేతికి ఆ కెమెరా బలంగా తగిలింది. ఈ ఘటన పట్ల ఫాక్స్ స్పోర్ట్స్ స్పందించింది. స్పైడర్‌క్యామ్ ఆపరేటర్ పొరపాటు వల్ల ఆ ఘటన జరిగినట్లు చెప్పింది. నోర్జా మాత్రం ఆ తర్వాత బౌలింగ్ వేశాడు. ఓ వికెట్ కూడా తీశాడు. వాళ ఆస్ట్రేలియా తన మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు కోల్పోయి 575 రన్స్ వద్ద డిక్లేర్ చేసింది. ఆ తర్వాత సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఒక వికెట్ నష్టానికి 15 రన్స్ చేసిన సమయంలో వర్షం వల్ల మ్యాచ్‌ను నిలిపివేశారు. సౌతాఫ్రికా ఇంకా 371 రన్స్ వెనుకబడి ఉంది.

# బంగ్లాదేశ్ క్రికెట్ హెడ్ కోచ్ డొమింగో రాజీనామా

## ఏడాది ముందే తప్పుకున్న కోచ్



ఢాకా,డిసెంబర్28(సమ సమాజం): బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రస్సెల్ డొమింగో తన పదవికి రాజీనామా చేశారు. కాంట్రాక్టు వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు ఉండగా.. ఏడాది ముందే కోచ్ పదవి నుంచి వైదొలిగాడు. బంగ్లా హెడ్‌కోచ్‌గా 2019లో కోచ్‌గా నియామకమయ్యాడు. డొమింగో కోచింగ్‌లో బంగ్లాదేశ్ చివరిసారిగా టీండియాతో ఆడిన 2-0తో సిరీస్‌ను కోల్పోయింది. దాదాపు సిరీస్‌లో టీండియాను బంగ్లాదేశ్ ఒడించినంత పని చేసింది. సిరీస్ తర్వాత బంగ్లా క్రికెట్ బోర్డ్ ఆపరేషన్స్ హెడ్ జలాల్ యూనస్ పలు మార్పులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంలో 'మాకు జట్టుపై ప్రభావం చూపగల కోచ్ అవసరం. తమకు కోచ్ కావాలని, మెంటర్ కాదు' కామెంట్ చేశాడు. ఈ వ్యాఖ్యలపై డొమింగో ఆగ్రహానికి రాజీనామా చేసినట్లుగా భావిస్తున్నారు. లేఖను పంపిన వెంటనే బంగ్లా బోర్డు డొమింగో రాజీనామా బోర్డు ఆమోదించింది. రస్సెల్ సార్థ్యంలో బంగ్లా జట్టు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లను కైవసం చేసుకుంది. అదే సమయంలో న్యూజిలాండ్‌లో మొదటిసారి టెస్ట్ మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసింది. దక్షిణాఫ్రికా, భారత్‌లపై వన్డే సిరీస్‌లను గెలుచుకుంది. ఇంతకు ముందు డొమింగో టీ20 కోచింగ్ బాధ్యతల నుంచి తప్పించి.. శ్రీధరన్ శ్రీరామ్‌కు అప్పగించారు. మార్చిలోగా కొత్త కోచ్‌ను నియమించనున్నది. మార్చిలో ఇంగ్లండ్‌తో స్వదేశంలో సిరీస్‌లో ఆడనున్నది. కొత్త కోచ్‌గా శ్రీలంకకు చెందిన చండికా హతురుసింఘే ఎంపికయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది.

# శిఖర్ ధావన్ కెరీర్ ముగిసినట్లేనా ?

న్యూఢిల్లీ,డిసెంబర్28(సమ సమాజం): వెటరన్ క్రికెటర్ శిఖర్ ధావన్‌ను శ్రీలంకతో సిరీస్‌కు సెలెక్టర్లు పక్కనబెట్టడడంతో ధావన్ కెరీర్ దాదాపుగా ముగిసినట్టేనని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే టీ20 జట్టులో చోటు కోల్పోయి వన్డేలకు పరిమితమైన ధావన్.. వచ్చే ఏడాది భారత్ లో జరుగబోయే వన్డే వరల్డ్ కప్ ఆడి కెరీర్ ను ముగిద్దామనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లతో జరిగిన వన్డే సిరీస్‌లలో పేలవ ప్రదర్శనతో ఇబ్బందిపడిన ధావన్‌ను వన్డే జట్టులోకి తీసుకోలేదు. పలు అంతర్జాతీయ పర్యటనల్లో వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అతడు.. ఇటీవల కాలంలో ఫామ్ లేమితో సమస్యలు ఎదుర్కొంటున్నాడు. శ్రీలంక తర్వాత టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో నూ వన్డే సిరీస్‌లు ఆడనుంది. అయితే రోహిత్ శర్మ కేఎల్ రాహుల్ జోడీ రూపంలో ఓపెనర్లు ఉండగా.. యువ ఆటగాడు ఇషాన్ కిషన్ సైతం చెలరేగుతున్నాడు. ఇక మరో యువ ప్లేయర్ శుబ్‌మన్ గిల్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో వెటరన్ ఓపెనర్ ధావన్‌కు వీళ్ల నుంచి గట్టి ఎదురవుతోంది. లంకతో సిరీస్‌లో వచ్చిన అవకాశాల్ని వాళ్లు సద్వినియోగం చేసుకుంటే.. ఇక ధావన్‌ను పూర్తిగా పక్కన పెట్టే అవకాశం ఉంటుంది. తన కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడే ఛాన్స్ లేకపోలేదు.అటు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొన్నాళ్లుగా ఆకట్టుకోని వికెట్ కీపర్ రిషబ్ పంత్‌పైనా సెలెక్టర్లు వేటు వేశారు. టెస్టుల్లో బాగానే ఆడుతున్నా.. టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ సిరీస్‌లలో రిషబ్ పంత్ పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో అతడి స్థానంలో ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్, సంజు శాంసన్‌లకు అవకాశం కల్పించారు. మీడియం పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు కూడా సెలక్టర్లు మొండి చెయ్యే చూపించార. టీ20 వరల్డ్ కప్‌లో ఒత్తిడికి లోనై పరుగులు సమర్పించుకున్న అతడిని లంక పర్యటనకు తీసుకోలేదు. జనవరి 3 నుంచి 15 వరకు శ్రీలంక భారత్‌లో పర్యటించనుంది. టీ20లకు హార్దిక్ పాండ్యా నేతృత్వం వహించనుండగా.. వన్డేలకు రోహిత్ కెప్టెన్ గా ఉండనున్నాడు.



## చలన చిత్రం



# వాల్తేరు వీరయ్య డబ్బింగ్‌లో చిరు, రవితేజ

'ఆచార్య', 'గాడ్‌ఫాదర్' వంటి బ్యాక్ టు బ్యాక్ ఫేయిల్యూర్స్ తర్వాత చిరంజీవి నుండి వస్తున్న సినిమా 'వాల్తేరు వీరయ్య'. బాబీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లు, పాటలు సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో చిత్రయూనిట్ ఇప్పటి నుండి ప్రమోషన్‌లు మొదలు పెట్టింది. తాజాగా వాల్తేరు వీరయ్య సెట్‌లోనే ప్రెస్ మీట్ నిర్వహించి సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయి. చిరంజీవితో పాటు రవితేజ కూడా డబ్బింగ్ స్టూడియోకి వచ్చాడు. ప్రస్తుతం ఆ ఫోటో నెట్టింట వైరల్‌గా మారింది. రవితేజ ఈ సినిమాలో పోలీస్ అధికారిగా కనిపించనున్నాడు. ఇటీవలే రిలీజైన ఆయన టీజర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. చిరంజీవి ఈ చిత్రంలో యూనియన్ లీడర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. చిరుకు జోడీగా శృతిహాసన్ నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు.



# నేను ఇండస్ట్రీ వీడడం లేదు

## వీడియో పోస్ట్ విడుదల చేసిన యాంకర్ సుమ

తెలుగు ఇండస్ట్రీలో టాప్ యాంకర్ ఎవరు అనే ప్రశ్నకు అందరికి టక్కున గుర్తొచ్చే పేరు సుమ కనకాల. ప్రీ రిలీజ్ ఈవెంట్ అయినా, టాక్ షో అయినా తన కామెడీ టైమింగ్ తో అందరినీ ఆకట్టుకుంటుంది. అయితే, తాజాగా ఓ షో ప్రోమోలో 'యాంకరింగ్ నుంచి కొన్ని రోజులు విరామం తీసుకుంటున్నా. ఇంతకాలం నన్ను ఆదరించినందుకు చాలా థాంక్స్' అంటూ కన్నీళ్లు పెట్టుకుని చెప్పింది. ఆ వీడియో వైరల్ అయ్యేసరికి సుమ నిజంగానే యాంకరింగ్ నుంచి బ్రేక్ తీసుకుంటుందేమోనని అంతా అనుకున్నారు. దీంతో సోషల్ మీడియాలో పర్సనల్ మెసేజ్ లు చేసి ఏం జరిగిందని ఆరా తీస్తున్నారట. దీనిపై స్పందించిన సుమ వాస్తవాలు వివరిస్తూ ఒక వీడియో పోస్ట్ చేసింది. 'నేను రీసెంట్‌గా ఒక న్యూఇయర్ ఈవెంట్ కు యాంకరింగ్ చేశా. అందులో కాస్త ఎమోషనల్ అయిన మాట వాస్తవమే. కానీ, అది ఇండస్ట్రీని వీడుతున్నట్లు కాదు. ఈ విషయంపై వస్తున్న వార్తల్లో నిజం లేదు. ప్రోమో చూసి అంచనాకు రావద్దు. ఈ ఈవెంట్ మొత్తం చూస్తే మీకు అసలు విషయం తెలుస్తుంది. నేను టీవీ కోసం, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం పుట్టా. ఇండస్ట్రీ విడిచి ఎక్కడికీ వెళ్లను. మీ వల్ల హ్యాపీగా ఉన్నా. హ్యాపీగా ఉండండి. అందరికీ హ్యాపీ న్యూ ఇయర్' అంటూ విషెస్ చెప్పింది. అది చూసిన సుమ ఫ్యాన్స్ అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# మార్కెట్ పెంచుకుంటున్న అజిత్



ప్రతి సినిమాకు అజిత్ తెలుగులో మార్కెట్ పెంచుకుంటూ పోతున్నాడు. మొన్నటి వరకు కోటీ రూపాయల మార్కెట్ కూడా లేని అజిత్.. 'వలిమై' సినిమాతో రెండు కోట్లకు పైగా మార్కెట్ పెంచుకున్నాడు. ఇక ఇప్పుడు తునివు సినిమాతో ఏకంగా రూ.3 కోట్ల ప్రీ బిజినెస్‌తో రంగంలోకి దిగడానికి సిద్ధమయ్యాడు. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన అజిత్ లుక్స్ సినిమాపై విపరీతమైన బజ్ క్రియేట్ చేశాయి. తెలుగులో తెగింపు పేరుతో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఎదురు చూస్తున్న ఈ సినిమా ట్రైలర్ అప్‌డేట్‌ను చిత్రబృందం తాజాగా ప్రకటించింది. తునివి ట్రైలర్ డిసెంబర్ 31న రిలీజ్ కానుంది. ఈ అప్‌డేట్‌తో అజిత్ ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఒకరోజు ముందుగానే న్యూ ఇయర్ వచ్చేసింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే తెలుగు ట్రైలర్ కూడా అదే రోజు రిలీజవుతుందా లేదా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో అజిత్ నెగెటీవ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నాడు. జిబ్రాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్‌తో కలిసి బేవ్యూ ప్రాజెక్ట్స్ బ్యానర్‌పై బోనీ కపూర్ అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తున్నాడు. ఇక గతంలో హెచ్. వినోద్, అజిత్ కాంబోలో తెరకెక్కిన వలిమై, విశ్వాసం సినిమాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలు సాధించాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా కూడా కమర్షియల్‌గా మంచి హిట్టవుతుందని చిత్ర యూనిట్ దీమాగా ఉంది.

# శరవేగంగా ఆర్‌సి-15 షూటింగ్



## ఫస్ట్ లుక్ కోసం అభిమానుల ఆత్రుత

మెగా అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న ... లెజెండరీ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్‌సి15' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నాడు. ఇప్పటికే లీకైన చరణ్ లుక్స్ సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొల్పాయి. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో చరణ్‌కు అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ వచ్చింది. దాంతో చరణ్ సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్‌లు వచ్చిన అవి క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ఇటీవలే రాజమండ్రిలో కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో కర్నూల్‌లో బిగ్ షెడ్యూల్‌ను ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో కొండారెడ్డి బురుజు దగ్గర చరణ్‌పై కీలక ఎపిసోడ్‌ను చిత్రీకరించనురు. అంతేకాకుండా ఈ సినిమాలో గూస్‌బంప్స్ తెప్పించే సీన్లలో ఇది కూడా ఒకటని సమాచారం. ప్రస్తుతం ఈ షెడ్యూల్‌కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయట. కాగా జనవరి మొదటి వారంలో షూటింగ్ ప్రారంభం కానుందట. ఇక షూటింగ్ ప్రారంభమై నెలలు గడుస్తున్న రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయకపోవడంతో మెగా అభిమానులు చిత్రబృందంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో మెగా ఫ్యాన్స్‌ను సంతోష పరిచేందుకు ఆర్‌సీ15 మేకర్స్.. చరణ్ పోస్టర్‌ను సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నారట. ఈ సినిమాకు సర్కారోడు అనే టైటిల్‌ను పరిశీలనలో ఉంచారు. చరణ్‌కు జోడీగా కియారా అద్వానీ ఈ సినిమాలో నటిస్తుంది. సునీల్, శ్రీకాంత్, అంజలీ, ఎస్.జే సూర్య కీలకపాత్రల్లో నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in